వేమన పద్యాలు అక్షర సత్యాలు

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- ఘనంగా వేమన జయంతి


యోగి వేమన చిత్రపటానికి నమస్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: వేమన పద్యాలు అక్షర సత్యాలుగా నిలుస్తాయని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. గురువారం ఉదయం ఏయూ పరిపాలన భవనంలో నిర్వహించిన యోగి వేమన జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భావితరాలకు వేమన పద్యాలను చేరువ చేయాలన్నారు. ఇటువంటి పద్యాలు చదవడం వల్ల చిన్నతనం నుంచి నీతిని అలవర్చడం సాధ్యపడుతుందన్నారు. వేమన చెప్పిన పద్యాలు నేటి సమాజానికి సైతం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్న విధానాన్ని పద్య రూపంలో వివరించారు. సులభమైన భాషతో, ఎంతో ప్రభావవంతమైన సందేశాన్ని వేమన తన పద్యాలలో పొందుపరిచారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, అకడమిక్ డీన్ ఆచార్య కిషోర్‌బాబు, బీసీడీఈ కోఆర్డినేటర్ ఆచార్య ఎన్.ఎ.డి.పాల్, ఎఫ్‌వో వనజారాణి, బి.వి.రమణారెడ్డి, ఎం.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు విభాగంలో..

ఏయూ తెలుగు విభాగంలో ప్రజాకవి వేమన జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య జర్ర అప్పారావు ఆధ్వర్యంలో ముందుగా వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వేమన జయంతిని అధికారికంగా ప్రకటించటమే కాకుండా జయంతి ఉత్సవాలను అన్ని చోట్లా జరపాలని ప్రభుత్వం నిర్ణయించడం తెలుగు భాషా, సాహిత్యాభిమానుల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీ కళాశాల తెలుగు విశ్రాంత ఆచార్యుడు మరడాన సుబ్బారావు, ఆచార్య వెలమల సిమ్మన్న, సుధారాణి కొండపు(బోర్డ్ ఆఫ్ డైరెక్టర్, ఉత్తర అమెరికా తెలుగు సమితి (నాటా), సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య, తెలుగు ఆచార్యులు అయ్యగారి సీతారత్నం, అన్నంశెట్టి ఈశ్వరమ్మ, బూసి వెంకటస్వామి, కట్టిపోగు రత్నశేఖర్, పెండ్యాల లావణ్య, ఆతుకూరి వెంకటేశ్వర్లు(యోగి), బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


వేమన చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఏయూ తెలుగు విభాగ ఆచార్యులు

పెదవాల్తేర్‌లో..

ఎంవీపీ కాలనీ: పెదవాల్తేర్ గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో వేమన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వేమన పద్యాలతో కూడిన నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేమన విగ్రహ దాత తొటిరెడ్డి మాస్టర్, గ్రామ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు బోర దాసురెడ్డి, కార్యదర్శి దల్లి అప్పలరెడ్డి, పలికిల నీలారెడ్డి, చిల్ల రామారావు రెడ్డి, చిన్నిపిల్లి రామిరెడ్డి, పిండిట్ల శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరిలోవ: స్థానిక నెహ్రూనగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజా కవి వేమన జయంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : వేమన జయంతి సందర్భంగా ఆశీలమెట్టలో గల విశాఖ జిల్లా వేమన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా దివంగత నేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు నీలాపు వివేకానందరెడ్డి మాట్లాడుతూ 18వ శతాబ్దం నాటి వేమన పద్యాలు ఇప్పటికీ ప్రాచుర్యంలో ఉన్నాయన్నారు. మహనీయుడి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగాజరపడం పట్ల సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. గౌరవ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి సత్తి నాగేశ్వరరెడ్డి, సత్తిరామకృష్ణరెడ్డిలు మాట్లాడుతూ సరళమైన భాషలో ఆయన రాసిన పద్యాలు ఎంతో ప్రాచుర్యం పొందాయన్నారు. పండితులు, పామరులను అవి అలరిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు బోర కుమార్‌రెడ్డి, ఏయూ పూర్వ అధ్యాపకులు తాతరెడ్డి, తిమ్మారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి, కర్రి రామారెడ్డి, దల్లి రామకృష్ణరెడ్డి, డీపీఎస్ ప్రసాద్‌రెడ్డి, బేరి గురుమూర్తిరెడ్డి, వేమన సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.


వేమన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పెదవాల్తేర్ గ్రామ పెద్దలు


ఆరిలోవలో వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


వేమన విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న వేమన సంక్షేమ సంఘం ప్రతినిధులు

క్లుప్తంగా

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించి బ్యాటింగ్ చేస్తున్న అక్కరమాని విజయనిర్మల

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం 13వ వార్డులో స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా సీఎం కప్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. తూర్పు నియోజకవర్గంలో 15 వార్డుల నుంచి 40 టీంలు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయి. ఈ టోర్నమెంట్‌ను గురువారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి కొంతసేపు క్రికెట్ ఆడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇలాంటి క్రీడా పోటీలతో యువతను ప్రోత్సహించవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో 9, 12 వార్డుల కార్పొరేటర్లు స్వాతి, అక్కరమాని రోహిణి, అటవీ శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ వనము వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, కెల్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని విశ్వబ్రాహ్మణ సంఘం క్యాలెండర్‌ను గురువారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు సంఘం ప్రతినిధులు విశ్వబ్రాహ్మణుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అనంతరం అమర్‌నాథ్‌ను సంఘం ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శివకోటి శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు సీతామహాలక్ష్మి, కోశాధికారి చంటిబాబు, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ టీడీఆర్ హబ్ పోర్టల్ ప్రారంభం


పోర్టల్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లేనరీ హబ్ పోర్టల్(టీడీఆర్)ను వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి ప్రారంభించారు. వీసీ కార్యాలయంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏయూ టీడీఆర్ డీన్ జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రవేశాలు పొందిన పరిశోధకులు, రీసెర్చ్ గైడ్‌లు శనివారంలోగా తమ వివరాలు సమగ్రంగా పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ పోర్టల్ ద్వారా రీసెర్చ్ గైడ్‌తో పరిశోధకులు ఎక్కడ నుంచైనా తమ పరిశోధనకు సంబంధించిన ప్రగతిని చర్చించడం, వివరించడం సాధ్యపడుతుంది. దశలవారీగా పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ సేవలు అందించే వేదికగా ఈ పోర్టల్‌ను తీర్చిదిద్దుతామన్నారు.

విశాఖ-రాయగడ సెక్షన్‌లో డీఆర్ఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-రాయగడ సెక్షన్ పరిధిలో గురువారం డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి విండో ట్రయలింగ్ తనిఖీలు నిర్వహించారు. ఆయా రైల్వే స్టేషన్లలో సదుపాయాలు, స్టాక్‌ను పరిశీలించారు. ఈ సెక్షన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన సమీక్షించారు. రాయగడ స్టేషన్‌లో అధికారులు, సిబ్బంది, ప్రయాణికులతో డీఆర్ఎం మాట్లాడి, వారి సమస్యలు, సూచనలు స్వీకరించారు.

ఆరోగ్యంపై మహిళలకు అవగాహన అవసరం


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: మహిళలకు సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండడం ఎంతైనా అవసరమని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీ 11వ వార్డు గాంధీనగర్‌లో క్రైస్ట్ కంపాషన్ ఫర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్యం -జీవన శైలిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికలు తమ ఆరోగ్యం దృష్టి పెట్టాలన్నారు. యుక్త వయసులో ఉన్నప్పటి నుంచి బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. తల్లులు తమ పిల్లల ఆహారపు అలవాట్లు క్రమశిక్షణ కలిగి ఉండేలా జాగ్రతలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఆరిలోవ జీవీఎంసీ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ అనిత మాట్లాడుతూ యుక్త వయసులో బాలికలు తీసుకునే పౌష్టికాహారం గురించి తెలియజేశారు. రుతుస్రావం సమయంలో శుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం మహిళలకు శానిటరీ నాప్‌కిన్ కిట్లు, హ్యాండ్‌వాష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, వైద్యులు జ్యోతి, సంతోష్, సొసైటీ అధ్యక్షుడు ప్రభుదాస్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాఖలో బీసీ భవన్ ఏర్పాటుకు వినతి

ఎంవీపీ కాలనీ: విశాఖలో బీసీ భవన్ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయాలని రాష్ట్ర బీసీ సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్ కోరారు. ఈ మేరకు అమరావతిలో రాష్ట్ర బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ, ఐ అండ్ పీఆర్ శాఖ మంత్రి చెల్లుబోయిన వెంకటగోపాలకృష్ణను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీ సంక్షేమానికి పెద్ద ఎత్తున కృషి చేస్తోందన్నారు. ఇదే స్ఫూర్తితో బీసీలకు రాజకీయ ప్రధాన్యం పెంచేలా కృషి చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న బీసీ నాయకులు

నేపాల్‌లో 13న మానవ హక్కులపై అభిప్రాయ సేకరణ


సమావేశంలో మాట్లాడుతున్నమంత్రి శ్యాంప్రసాద్

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): ఆసియా దేశాల్లో మానవ హక్కుల అమలు తీరుపై ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల మండలి వచ్చే నెల 13న నేపాల్ దేశం ఖాట్మండ్‌లో అభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్టు మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993 కంటితుడుపుగా ఉందని, ఈ చట్టంపై ప్రజాప్రతినిధులకు అవగాహన లేదన్నారు. బాలల హక్కులు, మానవ హక్కులు, మహిళల హక్కులకు ఏర్పాటు చేసిన కమిషన్‌లకు అధికారాలు కల్పించాలని, రాజకీయ పునరావాస కేంద్రాల స్థాయి నుంచి విముక్తి కల్పించాలని నివేదిక రూపొందిస్తున్నట్టు తెలిపారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో నేపాల్‌లో జరిగే సదస్సులో భారత్, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక దేశాలలో మానవ హక్కుల ఉల్లంఘనలు, చట్టాలు అమలు, తదితర అంశాలు చర్చించనున్నారని కౌన్సిల్ సభ్యుడు ఎం.సూర్యశ్రీనివాస్ తెలిపారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్, పీపుల్స్ వాచ్, కామన్ వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇన్సియేటివ్, తదితర మానవ హక్కుల స్వచ్ఛంద సంస్థలు భారత్ నుంచి ఆహ్వానం అందుకున్నాయన్నారు. ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు బీవీహెచ్ శ్రీరాములు, మార్టిస్ ఎర్రైనా, కె.రవికుమార్ పాల్గొన్నారు.


'ఎల్ఐసీని బలోపేతం చేయండి'

దాబాగార్డెన్స్: ప్రభుత్వ రంగాన్ని కాపాడాలని, ఎల్ఐసీని బలోపేతం చేయాలంటూ జీవిత బీమా రంగ ఉద్యోగులు నినదించారు. జీవిత బీమా వ్యాపార జాతీయాకరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం డివిజనల్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆ యూనియన్ అధ్యక్షురాలు ఎం. కామేశ్వరి, ప్రధాన కార్యదర్శి జి. వరప్రసాదరావు మాట్లాడుతూ 1956లో ఇదే రోజున అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి సీడీ దేశ్‌ముఖ్ జీవిత బీమా ఆర్డినెన్స్ జారీ చేసి దేశంలో జీవిత బీమా రంగంలో ఉన్న 245 ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలను జాతీయం చేశారన్నారు. ప్రజల డబ్బు.. ప్రజల కోసమే అనే నినాదంతో జీవిత బీమా వ్యాపార జాతీయాకరణ చేయాలనే డిమాండ్ స్వాతంత్ర్యోద్యమ సమయంలో అంతర్భాగంగా ఉందని, ఎల్ఐసీ దశాబ్దాలుగా, స్థిరంగా తన లక్ష్యాలు నెరవేరుస్తుందన్నారు. 1956లో రూ.5 కోట్ల ప్రారంభ మూలధనంతో ప్రారంభమైన ఎల్ఐసీ ఇప్పుడు రూ.42 లక్షల 30 వేల 617 కోట్ల ఆస్తులతో, రూ.37 లక్షల 35 వేల 760 కోట్ల లైఫ్ ఫండ్ కలిగి వ్యాపారంలో ప్రగతి కనబరుస్తుందన్నారు. ఇంత దృఢమైన స్థితిలో ఎల్ఐసీలో ప్రభుత్వం తన వాటాలో 3.5 శాతం ఉపసంహరించిందని, ఇది ఎల్ఐసీ మౌలిక లక్ష్యాలకు విఘాతం కల్గించే చర్య అన్నారు. పాలసీదారుల ప్రయోజనాలు దెబ్బతీసే చర్యగా పేర్కొన్నారు. అంతేగాక ప్రైవేటీకరణకు మొదటి అడుగని, కాబట్టి ఎల్ఐసీలో ఐపీవోను బీమా ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. భోజన విరామ సమయంలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా యువకుడు మృతి

తగరపువలస: ఆనందపురం మండలం ఎగువ యాతపేటకు చెందిన ముడసల శ్రీను (33) అనే గీత కార్మికుని మృతదేహం గురువారం తగరపువలస గోస్తనీ నదిలో లభ్యమయింది. మృతుని తల్లి అప్పల నరసయ్యమ్మ భీమిలి పోలీసులకు చేసిన ఫిర్యాదు ఇలా ఉంది. తొమ్మిది సంవత్సరాల క్రితం శ్రీనుకు భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటకు చెందిన రీసు గురమ్మ(చిన్నారి)తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. సంక్రాంతి పండగ సందర్భంగా ఈ నెల 15న సాయంత్రం కృష్ణంరాజుపేటలోని అత్తారింటికి శ్రీను వచ్చాడు. 17న భార్య గురమ్మ, తోడల్లుడు రాము, అత్తామామలు, తదితర కుటుంబ సభ్యులతో శ్రీనుకు గొడవ జరిగింది. అదేరోజు రాత్రి 7 గంటల సమయంలో శ్రీను బయటకు వెళ్లిపోయినట్టు గురమ్మ ఆనందపురంలో అత్తవారింటికి ఫోన్‌లో సమాచారం అందించింది. దీంతో అందరూ ఈ నెల 18న శ్రీను ఆచూకీ కోసం ప్రయత్నించినా ఎక్కడా లభించలేదు. గురువారం జాతీయ రహదారి గోస్తనీ నది వంతెన వద్ద లభించిన మృతదేహాన్ని చూడగా శ్రీనుదిగా బంధువులు గుర్తించారు. దీంతో అత్తారింట్లో జరిగిన గొడవ కారణంగా మనస్తాపంతో శ్రీను ఆత్మహత్య చేసుకోవడమో..? లేదా మృతుని శరీరంపై గాయాలను బట్టి ఎవరైనా హత్య చేసి ఉంటారేమోనని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చే వరకు ఆత్మహత్యగా కేసు నమోదు చేసినట్టు భీమిలి సీఐ కె.లక్ష్మణమూర్తి తెలిపారు.

'కెమికల్' విద్యార్థినికి ఉత్తమ ప్యాకేజీతో ఉపాధి


దాసరి వంశీప్రియాంక

మురళీనగర్(విశాఖ ఉత్తర): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) విద్యార్థిని దాసరి వంశీప్రియాంక ఉత్తమ ప్యాకేజీతో ఉపాధి పొందింది. రూ.6.73 లక్షల వార్షిక వేతనంతో ఏసియన్ పెయింట్స్ కంపెనీలో ఉద్యోగం సాధించింది. ఇంతవరకు డిప్లమా విద్యార్థులకు ఇంతటి ప్యాకేజీతో ఉద్యోగం వచ్చిన దాఖలాలు లేవని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. వంశీ ప్రియాంక ఈ కాలేజీలో కెమికల్ ఇంజినీరింగు కోర్సులో 2018లో చేరి 2022 ఏప్రిల్‌లో పాస్‌అవుట్ అయింది. ఈమెకు అచ్యుతాపురంలోని ఏసియన్ పెయింట్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ప్రిన్సిపాల్‌తో పాటు డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, డాక్టర్ ఎం.విజయలక్ష్మి.. ప్రియాంకను అభినందించారు.

ఒడిశా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


ఆత్మీయ కలయికలో పదో తరగతి 1993-94 బ్యాచ్ విద్యార్థులు

ఆరిలోవ: ఒడిశా రాష్ట్రం రాయగడలో గోపబంధు మున్సిపల్ హైస్కూల్ 1993-94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమావేశం గురువారం నగరంలో ఓ హోటల్‌లో జరిగింది. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఎవరు ఎక్కడెక్కడ స్థిరపడ్డారో అడిగి తెలుసుకున్నారు. విశాఖ, తిరుపతి, రాయగడ, శ్రీకాకుళం ప్రాంతాలతో పాటు ఆస్ట్రేలియా, ఆఫ్రికా దేశాలలో స్థిరపడినవారు ఈ ఆత్మీయ కలయికలో పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎం.మాధవి, ఎస్.శ్రీను, కె.వి.శర్మ, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

బీచ్ రోడ్డు: పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. గురువారం జీవీఎంసీ 21వ వార్డులో పాండురంగాపురం, రజక వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. స్థానిక సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. అనంతరం విజయనిర్మల మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పక్క రాష్ట్రాల సైతం అమలు చేసేందుకు సిద్ధమవుతున్నాయన్నారు. రజక వీధిలో పేదలు తమకు పక్కా నివాసాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఆమె స్పందిస్తూ ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రసాదాలు భాగ్యానంద్, మధుపాడ రవికుమార్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


పథకాల గురించి వివరిస్తున్న అక్కరమాని విజయనిర్మల

ఏయూకు ఈస్టర్న్ ఆర్మీ కమాండ్ ప్రశంస

దొండపర్తి(విశాఖ దక్షిణ): ఆంధ్రా యూనివర్సిటీలో రక్షణ అధ్యయనాల కేంద్రాన్ని స్థాపించడంపై కోల్‌కతా ఈస్టర్న్ ఆర్మీ కమాండ్ అధికారులు ప్రశంసించారు. గ్రాడ్యుయేషన్ డిగ్రీకి అర్హత సాధించడానికి సైనికుల అనుభవం, సేవను సమానం చేయడం ఏయూ అద్భుతమైన చొరవకు నిదర్శనమన్నారు. దీంతో చాలా మంది రిటైర్డ్ యువ సైనికులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రమశిక్షణ కలిగిన సైనికుల అనుభవం సంస్థల యజమానులకు కూడా ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ మేరకు ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. గత కొన్నేళ్లుగా పశ్చిమ బెంగాల్‌లో పదవీ విరమణ పొందిన సైనికుల సహాయం కోసం డిఫెన్స్ స్టడీస్ హెచ్‌వోడీ డాక్టర్ ఉజ్వల్ ఘటక్ చేస్తున్న ప్రయత్నాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ద్వారా 33 మంది మాజీ సైనికులు లబ్ధిపొందారని చెప్పారు.

ఇప్పటి నుంచే భవిష్యత్ ప్రణాళికల అమలు

విద్యార్థులకు ఏయూ వీసీ ప్రసాదరెడ్డి సూచన


ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: విశ్వ విద్యాలయంలో చేరిన తొలి రోజు నుంచి భవిష్యత్‌కు అవసరమైన అభివృద్ధి ప్రణాళికలు రచించుకుని, అమలు చేసుకోవడం తప్పనిసరని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. గురువారం ఉదయం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన సైన్స్ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన స్వాగత సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన చరిత్రను లిఖించే విధంగా చదవాలన్నారు. నిరంతరం గ్రోత్ మైండ్ సెట్‌ను కలిగి ఉండాలని సూచించారు. వర్సిటీలో ఉన్న కాలాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ కోర్సులు, పుస్తకాలు చదవడం, నూతన జ్ఞానం, నైపుణ్యాలను పొందడానికి కృషి చేయాలన్నారు. విద్యార్థులు ఉపాధి పొందడం, స్టార్టప్‌లుగా ఎదగడం అనే రెండు లక్ష్యాలను ఎంపిక చేసుకుని తదనుగుణంగా కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర యువత ఉపాధిని సృష్టించే స్థాయికి ఎదగాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షిస్తున్నారన్నారు. నవ్య ఆలోచనలకు ఎంతో విలువు ఉందన్నారు. ప్రశ్నించడం నుంచి ఆలోచన ఉద్భవిస్తుందని చెప్పారు. ఆచార్యులు తమ బోధనతో విద్యార్థుల హృదయాలలో స్థానం పొందాలన్నారు. ఆచార్యుల్లో జవాబుదారీతనం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికత మానవ మేధస్సుకు సవాళ్లు విసురుతున్నాయన్నారు. విశ్వ విద్యాలయంలో అకడమిక్ క్యాలెండర్‌ను పటిష్టంగా అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, విభాగాధిపతులు, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

22న హౌస్ బిల్డింగ్ సొసైటీ మహాజన సభ

మహారాణిపేట: ఈనెల 22వ తేదీన మధురవాడలోని కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యాలయంలో ది విశాఖపట్నం జిల్లా ఏపీ స్టేట్ గవర్నమెంట్ డ్రైవర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ మహాజన సభ నిర్వహిస్తున్నట్టు సొసైటీ చైర్మన్ జె.సత్యనారాయణ తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశంలో ప్రధానంగా హౌస్ బిల్డింగ్ సొసైటీ ద్వారా ఇళ్ల స్థలాల కేటాయింపు విషయమై ఇంత వరకు ప్రభుత్వంతో జరిగిన చర్చలు, బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు సభ్యులకు వివరించనున్నట్లు తెలిపారు. విశాఖ జిల్లా సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంకులో ఉన్న సొసైటీ నిధులకు సంబంధించి జమ, ఖర్చులు సభ ఆమోదం పొందడం, జిల్లా కోపరేటివ్ యాక్ట్ ప్రకారం సొసైటీ బైలా, అడిటర్ అభ్యంతరం ప్రకారం డైరెక్టర్లుగా రెండేళ్ల పదవీ కాలం పూర్తి చేసిన వారిని మార్పు చేయడం వంటి వాటిపై సమావేశంలో చర్చించనున్నట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన తెలిపారు. ఈ మహాజన సభకు ఏపీ గవర్నమెంట్ డ్రైవర్ల సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వై.నాగేశ్వరావు, ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ ఎస్.నాగేశ్వరరెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు. సభ్యులంతా ఈ సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పాత టైర్ల దుకాణంలో అగ్ని ప్రమాదం

గాజువాక : స్థానిక శ్రీనగర్‌లోని సివిల్ సప్‌లైస్ గోడౌన్ల సమీపంలో గల ఒక పాతటైర్ల దుకాణంలో గురువారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వంట కోసం కర్రల పొయ్యి వెలిగించడానికి పెట్రోల్ పోయడంతో ఈ సంఘటన చోటుచేసుకున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. సతేందర్ కుమార్ యాదవ్ అనే వ్యక్తి శ్రీనగర్‌లోని సివిల్ సప్‌లై గోడౌన్ల వద్ద పెట్రోల్ బంక్‌ను ఆనుకొని పాతటైర్ల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇద్దరు సిబ్బందిని నియమించుకొని పాత టైర్లకు పంక్చర్లు వేయడంతోపాటు రీబటనింగ్ పనులను నిర్వహిస్తున్నాడు. అందులోనే వంట చేసుకోవడం కోసం గురువారం కట్టెల పొయ్యి వెలిగించారు. అది మండటం కోసం అందులో పెట్రోల్ పోయడంతో ఒక్కసారిగా మంట పైకి వచ్చి అక్కడి పాతటైరుకు అంటుకుంది. ఆ మంట క్షణాల్లో మొత్తం దుకాణమంతా విస్తరించింది. దట్టమైన పొగతో కూడిన మంటలు ఎగసిపడ్డాయి. ఈ దుకాణానికి ఆనుకొని పెట్రోల్ బంక్ కూడా ఉండటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. పెదగంట్యాడ అగ్నిమాపక సిబ్బంది రెండు శకటాలతో అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు సంఘటన స్థలాన్ని సందర్శించి ప్రాథమిక విచారణ నిర్వహించారు.


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


జీలకర్ర, బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు స్వర్ణపుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. అలాగే ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై ఆశీనులను చేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అప్పన్న స్వామికి గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై ఆశీనులను చేశారు. అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.